సాక్షి కామారెడ్డి

మంగళవారం ၊ 3 ၊ అక్టోబర్ ၊ 2023



ఆనవాళ్లను కాపాడుకోవాలి

చారిత్రక ఆనవాళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



బాన్సువాడకు 3 వేల ఇళ్లు..

గృహలక్ష్మి పథకం కింద బాన్సువాడ నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరయ్యాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

35.5 /22.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురియవచ్చు.

మోదీ సభకు సన్నద్ధం



గిరిరాజ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు తరలివెళ్లేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి జనాలను తరలించేందుకు నేతలు ఏర్పాట్లు చేశారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించడానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో జన సమీకరణ చేయడంపై ఆయా నియోజకవర్గాల నేతలు దృష్టి సారించారు.

- నేడు ఇందూరులో బీజేపీ సభ
- జిల్లా నుంచి భారీగా తరలివెళ్లనున్న కాషాయ శ్రేణులు

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో నిజామాబాద్ సభ ద్వారా ఎన్నికల నగారా మోగించాలని బీజేపీ నిర్ణయించింది. ప్రధాన మంత్రి మోదీ ఈ సభలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సభను విజయవంతం చేసి సత్తా చాటాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

కామారెడ్డి జిల్లాకు సంబంధించి కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆధునీకీకరణకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. అలాగే రైల్వే లైన్ డబ్లింగ్‌కు కూడా నిధులిచ్చింది. ఇప్పటికే రైల్వే ఎలక్ట్రిఫికేషన్ పూర్తయ్యింది. బోధన్, బాన్సువాడ మీదుగా కొత్త రైల్వే లైన్‌కు మోక్షం లభించనుంది. ఈ నేపథ్యంలో మోదీ సభను విజయవంతం చేయడానికి జిల్లాకు చెందిన నేతలు ఏర్పాట్లు చేసుకున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీనుంచి జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి పోటీ చేయడం దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. ఆయన కొన్నేళ్లుగా జనంలో ఉంటూ ఎన్నికలకోసం పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. రోజూ ప్రజల మధ్యకు వెళ్లి, వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి హామీలిస్తూ ముందుకు సాగుతున్నారు. కుల సంఘాలతోపాటు ఆలయాల అభివృద్ధి, నిర్మాణానికి భారీగా నిధులిచ్చారు. ప్రజల సమస్యలపై పలు ఉద్యమాలూ చేశారు. ప్రధాని సభకు భారీగా జనాన్ని తరలించి సత్తా చాటాలని ఆయన యోచిస్తున్నారు. జుక్కల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార బరిలో నిలిచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. బాన్సువాడ నుంచి మాల్యాద్రిరెడ్డి పోటీ చేస్తారని భావిస్తున్నారు. ఎల్లారెడ్డిలో అభ్యర్థి ఎవరన్న దానిపై స్పష్టత రావడం లేదు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఇటీవల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో అక్కడ ప్రత్యామ్నాయంపై పార్టీ ఆలోచిస్తోందని సమాచారం. కాగా టికెట్లు ఆశిస్తున్న నేతలు మోదీ సభకు జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వాహనాల్లో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులను నిజామాబాద్ సభకు తరలించనున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు.



భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిజామాబాద్ జిల్లా కేంద్రానికి మంగళవారం రానున్న నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా బందోబస్తు ఏర్పాటు చేశారు. గిరిరాజ్ కాలేజీ మైదానాన్ని ఎస్పీజీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఎస్పీజీ, ఎన్‌హెచ్‌జీ ఐజీ, డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. నూతన కలెక్టరేట్ సమీకృత భవనం నుంచి వాయుసేనకు చెందిన రెండు హెలికాప్టర్లు ఏరియల్ సర్వే నిర్వహించాయి. కలెక్టరేట్ నుంచి మూడు కిలోమీటర్ల పరిసరాలను తనిఖీ చేశారు. 30 డాగ్‌స్క్వాడ్లు తనిఖీల్లో భాగమయ్యాయి.

2,500 మంది పోలీసులు

బందోబస్తు విధుల కోసం 12 జిల్లాల నుంచి పోలీసులు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సీపీ సత్యనారాయణతో మాట్లాడి బందోబస్తు వివరాలను తెలుసుకున్నారు. జీజీ కళాశాల గ్రౌండ్‌బయటి ప్రాంతం జిల్లా పోలీసుల ఆధీనంలో ఉంది. నూతన సమీకృత కలెక్టరేట్ నుంచి సభాప్రాంగణం వరకు ఉన్న 3 కిలోమీటర్ల పరిధిలో 2 వేల 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఐదుగురు ఎస్పీలు, ఇద్దరు బెటాలియన్ కమాండెంట్లు, పదమూడు మంది అదనపు ఎస్పీలు, 13 మంది ఏసీపీలతోపాటు 107మంది సీఐలు, 200మంది ఎస్సైలు, 1900 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన పోలీసులు వీఐపీ, వీవీఐపీలనూ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే లోనికి అనుమతించనున్నారు. 20 రకాల ఐడీ కార్డులను అధికారిక, అనధికారిక సిబ్బందికి పోలీసుశాఖ అందజేసింది.

నో ఫ్లయింగ్ జోన్

ప్రధాన మంత్రి పర్యటన పూర్తయ్యేంత వరకు డ్రోన్‌లకు అనుమతిలేదు. ఎవరైనా డ్రోన్‌లను వినియోగిస్తే కూల్చివేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ సత్యనారాయణ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి సభాస్థలి వరకు ఎలాంటి వాహనాలను అనుమతించేది లేదన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

- ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్, మెట్‌పల్లి, జగిత్యాల, కరీంనగర్, కామారెడ్డి, మెదక్ వైపు నుంచి వచ్చే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్‌లో ప్రజలను దింపాలి. ఉమెన్స్ కాలేజీ, పాలిటెక్నిక్‌గ్రౌండ్(ఎగ్జిబిషన్ గ్రౌండ్), సీఎస్ఐ కళాశాలలో వాహనాలను పార్కింగ్ చేయాలి.
- బాన్సువాడ, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, జుక్కల్, బోధన్, బైంసా, ముథోల్ ప్రాంతాల వైపునుంచి సభకు వచ్చే వాహనాలను అర్సపల్లి, రైల్వేగేట్, ఖానాపూర్ చౌరస్తాలో ప్రజలను దింపిన తరువాత, శ్రద్ధానంద్ గంజ్(కిసాన్‌గంజ్)లో పార్క్ చేయాలి.
- వీఐపీల వాహనాలను గిరిరాజ్ కళాశాల సమీపంలోని హనుమాన్ మందిరం వెనుక ప్రాంతంలో, వీవీఐపీల వాహనాలను ఆలయం ముందు ప్రాంతంలో పార్కింగ్ చేయాలి.

న్యూస్‌రీల్

జూనియర్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట



కామారెడ్డి అర్బన్: కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్టేడియంలో ఆది, సోమవారాల్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. అండర్–20 మహిళల విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో బి.అర్చన బంగారు, అండర్–18 డెక్లథాన్‌లో పరశురాం బంగారు పతకాలు సాధించారన్నారు. లాంగ్‌జంప్‌లో పరశురాం రజతం , అండర్–18 విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో ఎం.ఈశ్వర్ రజతం, అండర్–20 ట్రిపుల్ జంప్‌లో ఆర్.రవీందర్ నాయక్ రజతం, పదివేల మీటర్ల పరుగులో కే.అనిల్ కాంస్య పతకం, అండర్–16 ఐదు వేల మీటర్ల రేస్ వాక్‌లో కే.సంతోష్ కాంస్య పతకం సాధించారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

కౌలాస్‌లోకి 2,525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి కుండపోతగా కురిసిన వర్షాలకు కౌలాస్ ప్రాజెక్టులోకి 2,525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో సోమవారం ఉదయం కౌలాస్ ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి అంతే నీటిని దిగువనకు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీ) కాగా ప్రస్తుతం 457.7 మీటర్ల(1.164 టీఎంసీ) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

ఎస్‌జేఎం విభాగ్ సహ సంయోజక్‌గా రాజాగౌడ్



కామారెడ్డి టౌన్: స్వదేశీ జాగరణ్ మంచ్(ఎస్‌జేఎం) ఇందూర్ విభాగ్ సహ సంయోజక్‌గా జిల్లా కేంద్రానికి చెందిన బొర్ర రాజాగౌడ్ నియమితులయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మాదాపూర్‌లో జరుగుతున్న ఉమ్మడి ఆంధ్ర ప్రాంత ఎస్‌జేఎం ప్రశిక్షణవర్గ ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో తనకు బాధ్యతలు అప్పగించారని రాజాగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మంచ్ కామారెడ్డి జిల్లా సంపర్క్ ప్రముఖ్ డాక్టర్ వంగ రాహుల్ కుమార్, జిల్లా సంఘర్షణ వాహిని ప్రముఖ్ డాక్టర్ సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారన్నారు.

జాబ్‌మేళాలో 17 మంది ఎంపిక

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. డీఅండ్‌డీ టెక్ సొల్యూషన్స్ 17 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య తెలిపారు. 17 మంది విద్యార్థులకు ఆఫర్ లెటర్లు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

- ప్రధాని వస్తుండంటే కేసీఆర్‌కు భయం
- రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్
- మోదీ సభను జయప్రదం చేయాలని పిలుపు

కామారెడ్డి టౌన్: రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వస్తుండంటే చాలు సీఎం కేసీఆర్‌కు భయం పట్టుకుంటుందన్నారు. ప్రధాని వచ్చిన ప్రతిసారి ముఖం చాటేస్తారంటూ కేసీఆర్‌ను విమర్శించారు. కాంగ్రెస్ గ్యారంటీ లేని పార్టీ అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలో లేకున్నా రూ. 9 లక్షల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాష్ట్రంలో రైల్వే స్టేషన్‌ల ఆధునికీకరణకు నిధులిచ్చామని, 3 వందే భారత్ రైల్వేలను కేటాయించామని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు ప్రధాన మంత్రిని విమర్శించే స్థాయి లేదన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో ఉమ్మడి నిజామబాద్ జిల్లా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మంత్రి కేటీఆర్ ఇద్దరూ ఒకే రకమైన విమర్శలు చేస్తున్నారని, వారిద్దరూ ఒకటేనని పేర్కొన్నారు. లిక్కర్ స్కాంలో పేరున్న ఎమ్మెల్సీ కవిత పీఎం మోదీని విమర్శిస్తూ సోనియా గాంధీని పొగుడుతున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కంకణం కట్టుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధే తెలంగాణలో బీజేపీని గెలిపిస్తుందన్నారు. మంగళవారం నిజామాబాద్‌లో జరిగే ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రజలను కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర నాయకుడు మురళీధర్ గౌడ్, కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, ఎల్లారెడ్డి ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై 1,016 నామినేషన్లు వేస్తాం

- లబాన్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్
- బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా ప్రకటన



బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా చూపిస్తూ మాట్లాడుతున్న లబాన్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్

కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో 1,016 నామినేషన్లు వేయనున్నట్లు లబాన్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు.

తొమ్మిదేళ్లలో సీఎంను కలవడానికి 99 సార్లు ప్రయత్నించామన్నారు. సీఎంను కలిపించాలని వేడుకున్నా రాష్ట్రంలోని ఏ ఒక్క ఎమ్మెల్యే గానీ, మంత్రి గానీ, ఎమ్మెల్సీగానీ స్పందించలేదన్నారు. చివరికి ఇంటెలిజెన్స్ వాళ్లు సీఎంను కల్పిస్తామని చెప్పి అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఓపిక నశించిందన్నారు. లబాన్ లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చే 1977 నాటి 245 జీవో మాత్రమే అమలు చేయాలని కోరుతున్నామని, కొత్త జీవో అడగడం లేదని పేర్కొన్నారు. దీనిపై సీఎంకు ఇచ్చిన డెడ్‌లైన్ మంగళవారంతో ముగుస్తుందన్నారు. తమ సమస్యలపై స్పందించాలని సీఎంను వేడుకున్నా ఫలితం లేదని, సవాల్ చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక కురుక్షేత్ర యుద్ధమే మిగిలిందన్నారు. కామారెడ్డిలో సీఎంకు వ్యతిరేకంగా పోటీ చేసే అభ్యర్థుల వివరాలను ప్రకటించారు. కామారెడ్డి జిల్లాలోని గాంధారి మండలానికి చెందిన 328 మంది, లింగంపేటకు చెందిన 188 మంది, పెద్దకొడప్‌గల్‌కు చెందిన 200 మంది, వర్నికి చెందిన 100 మంది, సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలానికి చెందిన 50 మంది, ఆదిలాబాద్‌కు చెందిన 150 మంది కాయితీ లంబాడీలు కామారెడ్డి ఎన్నికల బరిలో నిలుస్తారని పేర్కొన్నారు. ఈనెల 6, 7, 8 తేదీలలో ఎప్పుడైనా సచివాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో లబాన్ సమాజ్ నాయకులు భజన్‌లాల్, నర్సింగ్, రతీరాం, జగదీష్, అమర్ సింగ్, బంతీలాల్, రవీందర్, పెంటయ్య, గోపాల్, సురేష్, సుభాష్, ఇంద్రజిత్, భీషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ లక్ష్మణ్‌కు వినతి

బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను సోమవారం కామారెడ్డిలోని బీజేపీ కార్యాలయంలో లబాన్ సమాజ్ నాయకులు కలిశారు. తమ సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాలంటూ వినతి పత్రం అందించారు. సీఎంపై 1,016 మంది పోటీ చేస్తున్న విషయాన్ని లక్ష్మణ్‌కు వివరించారు.

సిద్ధరామేశ్వరాలయ సందర్శన



భిక్కనూరు: కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి సిద్ధ రామేశ్వరాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పురావస్తు పరిశోధకుడు ఈమని శివ నాగిరెడ్డి ఆలయ పునరుద్ధరణ పనుల గురించి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనను అభినందించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, పూజారులు రామగిరి శర్మ, రాజేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ చూపిన బాటలో నడవాలి'

కామారెడ్డి క్రైం: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్మా గాంధీ చూపిన బాటలో నడవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి దేశం కోసం సర్వస్వం త్యాగం చేశారన్నారు. ఇద్దరి జయంతి ఒకే రోజని, వారు చూపిన బాటలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

గాంధీ జయంతిని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, సంతోష్, శ్రీధర్‌రెడ్డి, శేఖర్ కృష్ణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీకి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ పాటిల్

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

కామారెడ్డి క్రైం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



'ప్రగతి కొనసాగాలంటే బీఆర్ఎస్ గెలవాలి'



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సింధే, నాయకులు



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మద్నూర్: నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే తిరిగి తననే గెలిపించాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధే కోరారు. సోమవారం పెద్ద ఎక్లార గేటు వద్దనుంచి మద్నూర్ వరకు బీఆర్ఎస్ నేతలు భారీ ర్యాలీ తీశారు. అనంతరం మండల కేంద్రంలోని గురు ఫంక్షన్ హాల్‌లో మద్నూర్, డోంగ్లీ మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల కష్టసుఖాలు తెలుసుకోవడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. మళ్లీ తననే గెలిపిస్తే వచ్చే ఐదేళ్లు కడుపులో పెట్టుకుని చూసుకుంటానన్నారు. కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌పై బురదజల్లే కార్యక్రమాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తాయని, అలాంటివారి మాటలు నమ్మవద్దని కోరారు. కామారెడ్డి నుంచి కేసీఆర్ భారీ మెజారిటీతో గెలుపొందుతారన్నారు. జుక్కల్ నుంచి తాను కూడా ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన అనంతరం జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్ అని కేసీఆర్‌తో విన్నవించి నియోజకవర్గంలోని దళిత కుటుంబాలన్నింటికి దళిత బంధు వర్తించేలా చూడాలని కోరతానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సురేష్, మధుకర్, పార్టీ మండలాల అధ్యక్షులు బస్పీపటేల్, శశాంక్‌పటేల్, సొసైటీ చైర్మన్‌లు శీనుపటేల్, నాల్చర్ బాలు, నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ భవన ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి



బాన్సువాడ రూరల్: ఈనెల 4న బాన్సువాడలో రూ.కోటి 50 లక్షల నిధులతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ ప్రారంభోత్సవం, బాబు జగ్జీవన్‌రాం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలిండియా అంబేడ్కర్ సంఘం బాన్సువాడ డివిజన్ అధ్యక్షులు దేశాయిపేట్ ప్రశాంత్, జగ్జీవన్‌రాం సంఘం డివిజన్ అధ్యక్షుడు కాదేపురం గంగారాం కోరారు. మున్సిపల్ మంత్రి కేటీఆర్, స్పీకర్ పోచారం, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలు హాజరు కానున్న ఈ సభకు మండలంలోని దళితులు భారీగా హాజరు కావాల్సిందిగా కోరారు. ఏఎంసీ చైర్మన్ నర్సింలు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మన్నె చిన్న సాయిలు, నాయకులు శంకర్, బేగరి సాయిలు, మన్నె నాగభూషణం పాల్గొన్నారు.

బాల్కొండలో యోగా పోటీలు



బాల్కొండ: మండల కేంద్రంలో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా యోగా పోటీలను సోమవారం నిర్వహించారు. పోటీల్లో 232 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. నిర్వాహకులు అండర్-8 నుంచి అండర్-16 విభాగాల వరకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు ఐశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

సుభాష్‌నగర్: నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించే ప్రధాని మోదీ ఇందూరు జనగర్జన బహిరంగ సభ ఏర్పాట్లను ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. రెండ్రోజులుగా ఇక్కడే మకాం వేసి మోదీ సభ ఏర్పాట్లను ఎంపీ అర్వింద్, ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. వారి వెంట రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నాయకులు సంగప్ప, ధన్‌పాల్ సూర్యనారాయణ, దినేశ్ కులాచారి, జిల్లా, రాష్ట్ర, వివిధ మోర్చాల నాయకులు ఉన్నారు.

మోదీజీ.. మొర ఆలకించండి

- జిల్లాలో ఆయుర్వేదానికి పెరుగుతున్న ఆదరణ
- ఆసుపత్రి ఏర్పాటు చేయాలని వినతులు



నిజామాబాద్‌నాగారం: దీర్ఘకాలిక రోగాలు ఆయుర్వేదంతో నయమవుతుండడం, ప్రజల్లో డిమాండ్ పెరగడం జిల్లాలో ఆయుర్వేద ఆస్పత్రి ఏర్పాటు ప్రాధాన్యతను తెలుపుతున్నది. పక్షవాతం, కీళ్లసంబంధిత వ్యాధులు, డిస్క్ డిజార్డర్స్, సర్వైకల్, స్త్రీ సంబంధిత వ్యాధులు, ఇన్‌ఫర్టిలిటి, పిల్లల్లో వచ్చే డెవలప్‌మెంట్ డిజార్డర్స్, పైల్స్, ఫిస్టులా, చర్మసంబంధిత వ్యాధులు తదితర వాటికి ఆయుర్వేదంతో చక్కని ఫలితాలున్నాయి. దీంతో జిల్లాలో ఆయుర్వేదానికి డిమాండ్ పెరుగుతున్నది. అయితే రోగులకు కేవలం అవుట్‌పేషెంట్ సేవలు మాత్రమే అందుతున్నాయి. ఇన్‌పేషెంట్ సేవలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 17 ఆయుర్వేద ఆస్పత్రుల్లో అవుట్‌పేషెంట్ సేవలు అందుతుండగా, ఒక్కో ఆస్పత్రిలో ప్రతిరోజూ 30మంది వరకు రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు సైతం మందులు తీసుకొని వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఇన్‌పేషెంట్ సేవల కోసం వరంగల్, హైదరాబాద్‌లోని ఆయుర్వేద ఆస్పత్రులకు వెళ్తున్నారు. అక్కడే ఉండి వైద్యం చేయించుకుంటున్నారు. నిర్మల్, నిజామాబాద్‌జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన ఆయుర్వేద ఆస్పత్రిని గతంలో రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు, ప్రజాప్రతినిధులు సిద్దిపేటలో ఏర్పాటు చేయించారు.

జిల్లాలో అత్యవసరం

నిజామాబాద్‌జిల్లాలో ఆయుర్వేద ఆస్పత్రి ఏర్పాటు అత్యవసరం. రైలు సౌకర్యం ఉండడంతో జిల్లాకు సరిహద్దులో ఉండే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రజలు సైతం ఆయుర్వేద వైద్యం కోసం జిల్లాకు వస్తున్నారు. ఆయుర్వేద వైద్యం కోసం 50 పడకల ఆస్పత్రిని కచ్చితంగా ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

చారిత్రక ఆనవాళ్లను కాపాడుకోవాలి

- పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి
- టేక్రియాల్ సమీపంలోని వెయ్యేళ్లనాటి సమాధుల పరిశీలన



సమాధులను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

సాక్షి, కామారెడ్డి: చారిత్రక ఆనవాళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కామారెడ్డి పట్టణ శివార్లలోని టేక్రియాల్ చెరువు సమీపంలో వెయ్యేళ్ల నాటి ఇనుప యుగపు సమాధులను ఆయన పరిశీలించారు. చరిత్ర పరిశోధకుడు మంచాల శ్రీకాంత్ ఇచ్చిన సమాచారంతో ఈ సమాధులను సందర్శించినట్లు ఆయన తెలిపారు. గతంలో 25కుపైగా బండరాళ్ల సమాధులు ఉండేవని, ప్రస్తుతం రెండు మాత్రమే మిగిలాయని పేర్కొన్నారు. పట్టణీకరణలో భాగంగా అన్నీ కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 15 అడుగుల నుంచి 25 అడుగుల వ్యాసంతో ఒక మీటరు పొడవు, ఒక అడుగు ఎత్తు ఉన్న గుండు రాళ్లను గుండ్రంగా అమర్చి నిర్మించే ఈ ఇనుప యుగపు సమాధుల్లో నాటి మానవుల అస్తికలు, వారు వాడిన పరికరాలు, పాత్రలు నిక్షిప్తం చేసేవారని తెలిపారు. ఆయన వెంట మంచాల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బాన్సువాడకు 3 వేల 'గృహలక్ష్మి' ఇళ్లు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ రూరల్: బాన్సువాడ నియోజకవర్గానికి 3 వేల గృహలక్ష్మి ఇళ్లు మంజూరైనట్లు అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం తన నివాసంలో బాన్సువాడ మున్సిపాలిటీ, బాన్సువాడ గ్రామీణ మండల లబ్ధిదారులకు గృహలక్ష్మి ఇంటి మంజూరు ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేసి మాట్లాడారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా పేదలు కనీసం రెండు గదుల ఇళ్లు కట్టుకోవాలని బేస్‌మెంట్ పూర్తికాగానే ఒక బిల్లు, స్లాబ్ వేయగానే మరోబిల్లు, ఇళ్లు పూర్తయిన తర్వాత చివరి బిల్లు రూ.లక్ష చొప్పున అందజేస్తారన్నారు. బిల్లుల కోసం దళారులకు డబ్బులు ఇవ్వొద్దన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 283, గ్రామీణ మండలంలో 195 మందికి గృహలక్ష్మి ఇళ్లను మహిళల పేరుతో మంజూరు చేశామని అన్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఎంపీపీ నీరజావెంకట్రాంరెడ్డి, ఆర్డీవో భుజంగ రావు, రైతుబంధు జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, నాయకులు మోహన్‌నాయక్, గోపాల్‌రెడ్డి, మాలెపు నారాయణరెడ్డి, కమటాల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు



ఎల్లారెడ్డిలో..



మద్నూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు సోమవారం ఆయా మండలాల్లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలు తీర్చేలా ప్రభుత్వానికి ఆలోచన కల్పించాలని గాంధీజీని వేడుకున్నామన్నారు. కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అప్పటి వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. పలువురు సంఘీభావం తెలిపారు.



నాగిరెడ్డిపేటలో..



మాచారెడ్డిలో భిక్షాటన చేస్తున్న ఆశావర్కర్లు

మీడియా రక్షణ చట్టం అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: దేశంలో మీడియా రక్షణ చట్టం అమలుతో పాటు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(ఐజేయూ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గంజ్‌లో గాంధీ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు రైల్వేపాస్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వాలు పాత్రికేయుల రక్షణ కోసం చట్టాలు కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, జిల్లా కోశాధికారి ముందా వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



లింగంపేటలో ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీలు



జిల్లా కేంద్రంలో గాంధీ చిత్రపటానికి వినతిపత్రం

సాక్షి నెట్‌వర్క్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు నిరసన ప్రదర్శనలు కొనసాగించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. పలుచోట్ల మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందించి నిరసన తెలియజేశారు. పలువురు సంఘీభావం తెలిపారు.



నస్రుల్లాబాద్‌లో ..



ఎల్లారెడ్డిలో రోడ్డుపై భోజనాలు చేస్తూ..

లక్కంపల్లి సెజ్‌లో యూనిట్ల నిర్మాణం పూర్తి చేయాలి

- బీఆర్‌ఎస్ హయాంలో పనులు మందగించాయి..త్వరగా పూర్తి చేయండి
- ప్రధానికి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలోని నందిపేట మండలం లక్కంపల్లి సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి)లో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరిశ్రమలు, ఆహార శుద్ధి పరిశ్రమల యూనిట్ల నిర్మాణం పూర్తి చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో లక్కంపల్లి సెజ్‌కు 390 ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా అప్పటి కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్‌పవార్‌తో తాను మాట్లాడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం రూ.50 కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావడంతో సదరు యూనిట్ నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయిందన్నారు. ప్రధానమంత్రి ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణం పూర్తి చేయించాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగి నిజాయితీ



మోర్తాడ్: బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును తాత్కాలిక ఉద్యోగి ప్రసాద్ బాధితురాలికి అప్పగించి తన నిజాయితీ చాటుకున్నాడు. సోమవారం జగిత్యాల్ జిల్లా బండాలింగాపూర్‌కు చెందిన రాధా మోర్తాడ్ బస్టాండ్‌లో తన బ్యాగును మరిచిపోయింది. గమనించిన ప్రసాద్ బ్యాగును దాచి ఆమె రాగానే నలుగురి సమక్షంలో విచారించి అందులో ఉన్న నగదు రూ.9,700, రూ.12వేలు విలువ చేసే కమ్మలు, సెల్‌ఫోన్, ఇతర సామాగ్రిని అందజేశారు.

క్రైం కార్నర్

ఆటోను ఢీకొన్న కారు



జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. పడకల్‌నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొన్నది. ఈ ఘటనలో ప్రయాణికురాలు పడకల్‌కు చెందిన జీల రజితకు తీవ్రగాయాలు కాగా ఆమె కూతురు, ఏడాది కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ఉన్నారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

బీర్కూర్‌లో పిచ్చికుక్కల దాడి



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్, బైరాపూర్ గ్రామాల్లో పిచ్చికుక్కలు సోమవారం వీరంగం సృష్టించాయి. బైరాపూర్‌కు చెందిన కుమ్మరి నారాయణపై పిచ్చికుక్క దాడి చేయడంతో కంటివద్ద తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మాపూర్‌లో ఇద్దరిపై, మండల కేంద్రంలోని రంగాజీనగర్ కాలనీలో సోని, వర్షిత్ అనే చిన్నారులపై, మజీద్ గల్లీలో విశ్వరావప్ప అనే వృద్ధుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. కొత్తాబాద్ సతీశ్ అనే వ్యక్తిని కూడా గాయపర్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఒకేసారి కుక్కలు స్వైరవిహారం చేసి పలువురిని గాయపర్చడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వాహనాల తనిఖీ



ఎల్లారెడ్డి: మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై గణేశ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు, ఇన్సూరెన్సు, నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్లు, ఆటోలు, బైకులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు తప్పకుండా తమవద్ద ధ్రువీపత్రాలను ఉంచుకోవాలని సూచించారు. పలువురి వాహనదారులకు జరిమానా విధించారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

బాన్సువాడ రూరల్: ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని ఇబ్రహీంపేట్‌లో చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ పట్టణం రాకాసిపేటకు చెందిన షేఖ్ రహూఫ్(31) ఇబ్రహీంపేట్‌లో ప్రసవించిన తన భార్య, బిడ్డను చూసేందుకు సెప్టెంబర్ 27న వచ్చాడు. అదేరోజు తీవ్రజ్వరానికి గురైన రహూఫ్‌ను తన మామ స్థానిక ఆర్‌ఎంపీ యాదగిరిగౌడ్‌కు చూయించారు. పరీక్షించిన ఆర్‌ఎంపీ నడుము భాగంలో జ్వరం తగ్గకపోవడంతో విడతల వారీగా మూడు సార్లు ఒకే చోట సూది ఇచ్చాడు. దీంతో చర్మం కమిలిపోయింది. దీంతో ఉస్మాన్‌ను అతని తండ్రి ఇబ్రహీం మొదటగా బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. అక్కడి నుంచి మరో ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. తన కుమారుని మృతుకి ఆర్‌ఎంపీ కారణమని మృతుడి తండ్రి ఇబ్రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ఒకరు..



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్ (57) చెరువు మునిగి మృతి చెందాడు. ఆదివారం ఇంటి నుంచి బయలు దేరిన షేక్ హుస్సేన్ ఇటీవల చెరువులో నిమజ్జనం చేసిన గణపతుల విగ్రహాల కింద ఉండే ఇనుపచువ్వలను తీసుకునేందుకు మండల కేంద్రంలోని ఊర చెరువులోకి దిగాడు. రాడ్లు తీసే క్రమంలో విగ్రహంలోని ఇనుపచువ్వల్లో కాలు ఇరుక్కుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. సోమవారం చెరువులో మృతదేహం లభ్యం కావడంతో మృతుడి భార్య ఖాదర్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సోమారం రోడ్డుపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన పుట్టల సాయిలు, ఇందల్వాయి మండలం గన్నారంకు చెందిన చంద్రు బైకులపై వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి.

హైదరాబాద్‌లో సిరికొండ వాసి..




సిరికొండ: హైదరాబాద్‌లో సిరికొండకు చెందిన వెంగల సాగర్(30) ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. సాగర్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. స్నేహితులతో గదిలో ఉండే సాగర్ శనివారం లాడ్జీలో గది అద్దెకు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికుల ద్వారా తెలిసినట్లు వారు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు గతంలోనే చనిపోగా ఇద్దరు అక్కలు ఉన్నారు. సోమవారం సాయంత్రం సిరికొండలో మృతుడి అంత్యక్రియలు నిర్వహించారు.

పిల్లలు పుట్టడం లేదని..



బీబీపేట: పిల్లలు పుట్టడం లేదని ఒకరు తీవ్ర మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మద్దూరి పోచయ్య (50) వ్యవసాయ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. కొద్ది రోజులుగా తనకు పిల్లలు కలగడం లేదని, చేసిన అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై గ్రామ పెద్దచెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య బాలలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాము కాటుతో వృద్ధుడు..



కామారెడ్డి క్రైం: పాము కాటుకు గురై ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పరమేశ్వర్ (70) ఆరు నెలలుగా ఆలయ సేవ చేసుకుంటూ టేక్రియాల్ శివారులోని కృష్ణ మందిరంలో ఉంటున్నాడు. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి తనను పాము కాటు వేసిందని వైద్యులకు తెలుపగా పరీక్షించిన వైద్యులు చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై గుండెల రాజు తెలిపారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్ కలకలం

బోధన్: మండలంలోని పెంటాకుర్దు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు టీచర్లు సాయిలు, శివయ్యపై ఈ నెల 29న డీఈవో దుర్గాప్రసాద్ సస్పెన్షన్ వేటు వేశారు. కలకలం రేపిన ఈ ఘటన ఉపాధ్యాయుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తరగతి గదిలో విద్యార్థినులపై సదరు ఉపాధ్యాయులు అనుచిత భాషతో అమర్యాదగా మాట్లాడడం, కులం పేరుతో పిలిచి అవహేళన చేస్తున్నారని కొందరు విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పుకోవడంతో వారు పాఠశాలకు వచ్చి కొన్ని రోజుల క్రితం టీచర్లను నిలదీశారు. ఈ క్రమంలో బాలికల అభిప్రాయాలను వీడియో రికార్డు చేసి డీఈవోకు పంపించారు. తమ వల్ల తప్పిదం జరిగినట్టు టీచర్లు హెచ్‌ఎంకు వివరణ ఇవ్వగా వారు ఇచ్చిన సంజాయిషీని డీఈవోకు పంపించారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో నాగ్‌నాథ్, మండల నోడల్ అధికారి నాగయ్య విచారణ చేపట్టగా నివేదిక ఆధారంగా టీచర్లను సస్పెన్షన్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఈవో నాగ్‌నాథ్‌ను ఫోన్‌లో సంప్రదించగా టీచర్లపై చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

అన్నారంలో చిరుత ఆనవాళ్లు



బాన్సువాడ: బీర్కూర్ మండలం అన్నారం శివారులో సోమవారం చిరుత ఆనవాళ్లు కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. గుట్ట ప్రాంతంలో చిరుత కాలి గుర్తులు పరిశీలించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. రాత్రి వేళల్లో శివారు ప్రాంతాలకు ఎవరూ వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు గ్రామస్తులకు సూచించారు.